TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

**శ్రీ దురిశెట్టి రామయ్య, గరిపల్లి గ్రామం, సుల్తానాబాద్ మండలం, కరీంనగర్ జిల్లావారి బృందంచే**

# "కడ్డి తంత్రి వాద్య కళా ప్రదర్శన"

**సమన్వయకర్త: శ్రీ రంగా దాసరి, జానపద సాహిత్య విజ్ఞాన పరిశోధకులు, వారి ఆధ్వర్యంలో 158వ చర్చా కార్యక్రమం జరిగింది.**

ఈ సందర్భంగా:

**తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఛైర్మన్ శ్రీ వేదకుమార్ మాట్లాడుతూ**

400 సం॥లకు పైగా వీరి పూర్వీకుల నుండి ఈ కళ ప్రదర్శించబడుతోందని, ఈ కళా ప్రదర్శనను వారసత్వంగా తీసుకుని వారు దీనిని బ్రతికిస్తున్నారు.ఆధ్యాత్మికపరంగా వీరి ప్రదర్శన కొనసాగిస్తూ, ప్రజలకు సంతోషం కలిగించేవారు. వీరికి చదువు రాకపోయినా మౌఖికంగానే వీరి కళను ప్రదర్శిస్తున్నారు. ఇంతకు ముందు వీరిని రాజులు, సంస్థానాధిపతులు పోషించేవారు. కానీ కాలక్రమేణా ఇప్పుడు ఈ కళకు ఆదరణ తగ్గి, పోషణ భారం పెరగడంతో చాలా దీన స్థితిలో జీవనం కొనసాగిస్తున్నారు. ఎంతో గొప్పదైన ఈ కళా సంపద కనుమరుగు కాకూడదు, ఈ కళను మన భవిష్యత్ తరాల వారికి అందించాలి, దీనిని బ్రతికుంచుకునే బాధ్యత మనందరిదీ.మన సంస్కృతినీ, కళారూపాల్ని, చరిత్రనీ రక్షించుకోవాలనీ తెలిపారు. వీరిని, వీరి కళను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దృష్టికి తీసుకు తీసుకువెళ్ళి వారి సాధకబాధకాలను తెలియజేసి వారికి ఆవాసాన్ని, జీవన భృతిని ఏర్పాటుచేసే క్రమంలో టిఆర్‌సి ప్రయత్నం చేస్తోంది. మన ప్రాంతం యొక్క కళలను, చరిత్రను, జానపద, మౌఖిక, సాంస్కృతిక కళా రూపాలను ప్రజలకు పరిచయం చేయడం, ఈ కళలను కాపాడడం మనందరి బాధ్యత. ప్రభుత్వం వీరి కళను ఆదరించి, వీరికి రవాణా సౌకర్యాలు, గృహవసతులు మరియు పింఛన్లు కల్పించాలి అని కోరారు.

ఈ కళాకారుల కుటుంబాలకు మనోధైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉంది. దీనిని ఆదరించే ఒక మార్గం ఈ కుటుంబ సభ్యుల వారసత్వంగా ఈ కళలను ముందుకు తీసుకువెళ్ళాలని ఆయన కోరారు. ఈ కళను గౌరవించి వారిని ప్రోత్సహిస్తే ఈ కళాకారులకు ఢోకా ఉండదని అన్నారు.

**డా॥ ఎ.కె. ప్రభాకర్, రచయిత, రీసెర్చ్ స్కాలర్ మాట్లాడుతూ**

జానపదంగురించి నేర్చుకున్నది ఇలాంటి పెద్దలవల్లనే. ఈ సంస్కృతిని కాపాడుతున్న శ్రీ తిరుమలరావుగారు మరియు శ్రీ వేదకుమార్‌గార్లకు అభినందనలు. నేను ఆంధ్రప్రాంతంవాడినైనా నా సంచారం మొత్తం తెలంగాణలోనే. ఈ కళల పట్ల, కళాకారులపట్ల మమకారం మాత్రమేకాదు, దీనిని ఆదరించే సంగీత ప్రియుల ఆదరణకూడా కావాలి. విప్ర వినోదులు మరియు ఇతర కళాకారులను కూడా టిఆర్‌సి భవిష్యత్ కార్యక్రమానికి తీసుకువస్తామన్నారు. నవ తెలంగాణలో ఇటువంటి కళలను బయటికి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనివల్ల వారసత్వంగా ఈ కళలను ముందు తరాలవారికి అందించవచ్చు. ఈ కళలు భవిష్యత్ తరాలకు అవగాహన కలిగిస్తుంది. కొందరు కళాకారులు విద్యనభ్యసించినా, ఉన్నత స్థానాన్ని పొందిన ఈ కళలను మరచిపోలేక ఇంకా కొనసాగిస్తున్నారు. కడ్డీ వాద్యము మరియు వీణ మధ్య పోటీ పెట్టి దీని విశిష్ఠతను తెలియజెప్పగలగాలి. ప్రజల ఆదరణతోనే ఇటువంటి కళాకారులు మరియు కళలు ఎప్పటికీ మనగలుగుతాయి. ప్రభుత్వం ఈ కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తే బాగుంటుంది.

**శ్రీ దాసరి రంగా, జానపద విజ్ఞాన పరిశోధకులు, ఉస్మానియా యూనివర్సిటీ,** (వీరు ప్రొ॥ తంగెడ కిషన్‌రావుగారి పర్యవేక్షణలో మహబూబ్‌నగర్ జిల్లా జానపదా కథాగేయాలు–ఒక పరిశీలన అనేఅంశంపై పిహెచ్‌డి చేస్తున్నారు.) వీరు మాట్లాడుతూ

ఇతిహాస పురాణాలలో ఒకసారి చూసినట్లయితే పూర్వం దేవలోకంలో భక్తి శ్రద్ధతో విష్ణుసేవ చేసినందుకు వారి సేవను

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

మెచ్చి, స్వయానా విష్ణుదేవుడే వచ్చి ఈ కడ్డీ తంత్రి వాయిద్యాన్ని ఇచ్చాడని ప్రతీతి.
ఈ కళాకారులు ఎక్కువగా హరినామ స్మరణ చేస్తూ వైష్ణవ గీతాలను ఆలపిస్తూ, కడ్డీ తంత్రీ వాయిద్యాన్ని వాయిస్తారు.
వీరిని మిత్తుల్ అయ్యవార్లు అంటారు. వీరు హరిజన ఆశ్రిత కులాలకు అయ్యవార్లుగా ఉంటూ మాదిగ మాస్టీలు, సిందులవారికి, దక్కలివారికి, ఈనెలవారికి, మాలవారికి, మాల మాస్టీలకు, గుర్రపువాళ్ళకు, పంబాలవార్లకు వీరి ఇండ్లలో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యి దగ్గరుండి జరిపిస్తారు.
ఈ కడ్డీ తంత్రి వాద్యం టేకు కట్టెతో చేసిన ప్రాచీన జానపద వాయిద్యం. దీని పొడుగు 2 గజాలు, వెడల్పు ఒక గజం. దీనిని మీటినపుడు సప్తస్వరాలు పలకడానికి నాలుగు తీగెలు బిగించబడి ఉంటాయి. మొదటిది మందారతీగ–ఇత్తడితో తయారు చేస్తారు. మూట తీగఒకటి – ఈ తీగ ఇనుముతో తయారుచేస్తారు. పాట తీగలు రెండు–ఇనుముతో తయారుచేస్తారు. ఈ తీగలనుండి రాగం రావటానికి అనువుగా గుర్రాన్ని అమరుస్తారు. ఈ గుర్రాన్ని జిట్టరేగి కర్రతో తయారు చేస్తారు. గుర్రం కదలకుండా ఉండడానికి ఇరువైపులా మట్టి పెంకెలను అమరుస్తారు. తీగ లాగడానికి సంగీత స్వరాలను నియమబద్ధం చేయడానికి నాలుగు తిరుగుళ్ళను అమరుస్తారు. ఈ తిరుగుళ్ళను జిట్టరేగికర్రతో తయారుచేస్తారు. కడ్డీతంత్రి పుల్ల ( చిటికె పుల్ల, ఎడమ పుల్ల అంటారు. గజ్జెల పుల్ల, కుడిచేత్తో మీటుతారు.. వీటిని కంక కట్టెతో తయారు చేస్తారు. ఈ కడ్డీ తంత్రి వాయిద్యము వాయించడానికి అనువుగా క్రింది భాగంలో రెండు కర్రలను పాదాలుగా అమరుస్తారు. తిరుగుళ్ళ క్రింది భాగంలో ఒక హంస బొమ్మను తయారు చేస్తారు. సంగీత సాధనకు సూచనగా ఈ హంసబొమ్మను సరస్వతిగా భావించుకుంటారు. మృదంగం, తాళం, గజ్జెలు, చిరుతలు కడ్డీతంత్ర వాయిద్యం వాయిస్తూ గేయరూపంగా కథ చెబుతూ ఉంటారు.
మిత్తుల అయ్యవార్లు, దాసర్లు అని పిలువబడే వీరు ఈ వాయిద్యంలో ప్రవీణులు. ఈ వాయిద్యం వీణమాదిరిగా ఉంటుంది.వీరికి ప్రాణప్రదమైనది, జీవనాధారం కూడా ఈ వాయిద్యమే. దీనికి ప్రత్యేకమైన శిక్షణతోను, సాధనతోనూ సాధించవలసినదే. అందువల్లనే ఈ వాయిద్యము వాయించడంలో ప్రవీణులు చాలా తక్కువ. ఈ కళాకారులు తెలంగాణ ప్రాంతంలో కరీంనగర్ జిల్లా, ఆదిలాబాద్, మెదక్, అక్కడక్కడా కనిపిస్తున్నారు. వీరికి సరైన చేయూతలేక, కళ అంతరించిపోతోంది. వీరికి చేయూతనిచ్చి, ఈ కళా రూపాన్ని, ఈ పురాతన కడ్డీతంత్ర వాయిద్యాన్ని శిధిలం కాకముందే పదిలం చేసుకోవలసిన అవసరం ఉంది.

ఈ కళ రక్షకులు, పోషకులు శ్రీ గురిశెట్టి రామయ్య బృందం గత నాలుగువందల సం॥నుండి ఈ కడ్డీ తంత్ర వాయిద్యాన్ని వారి తాతల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ప్రస్తుతం గురిశెట్టి రామయ్య, వారి కుమారుడు ఆంజనేయులు, తదితరులుతో వారసత్వం కొనసాగుతోంది.

ఈ కార్యక్రమంలో ఎ.కె.ప్రభాకర్, సజ్జన్‌కుమార్, రూప్‌చంద్, ఎస్ రఘునందన్, ఎన్.కృష్ణకుమార్, దాసోజు కృష్ణమాచారి, , ఎం. సుధాకర్, విద్యాసాగర్‌రెడ్డి, డి.సతీష్‌కుమార్, శ్రీ ద్యావనపల్లి సత్యనారాయణ, ఎస్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ రిసోర్స్ సెంటర్**